Price: Rs. 9-00

ధర్మాన్ని కాపాడండి అది మిమ్మల్ని కాపాడుతుంది

• తిరుమల తిరుపతి దేవస్థానములు •

Printed and Published by Sri D.V.L.N Murthy, I.A.S., Executive Officer, Tirumala Tirupati Devasthanams, Tirupati and Printed at T. T.D. Press, Tirupati. - C. 5,000 dt. 1-10-94.

అధ్యాత్మిక వ్యాసములు

రచయిత:

శ్రీ జటావల్లభుల పురుషోత్తము, ఎం.ఏ.,

ప్రచురణ:

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

1994

కర్మ సిద్ధాంతము

ప్రతి కర్మకును ఫలముండు ననునది కర్మసిద్ధాంతము లోని ప్రాతిపదిక నియమము. దీని యర్థమును స్పష్టముగా [illegible]వలసి యున్నది. తెలిసికొందుమేని యీ నియమ మును నమ్ముటయు నమ్మకపోవుటయు నను విచారణమున కే యవకాశ ముండదు. ఈ నియమ మొక స్వయం ప్రకాశక సత్యముగా గోచరించును.

కర్మయు, కర్మఫలము అనునవి భిన్నములుగావు. కర్మయొక్క చివరిదశయే కర్మఫలము. ఫలమనునది క్రొత్తగా [illegible] మరొకవస్తువు కాదు. పూవు, పిందె, కాయ, పండు– ఇవి యేరీతిగా క్రమావస్థలో యట్లే యొక పాపముచేయుట, దుఃఖ మనుభవించుట క్రమావస్థలు. ఇక్కడ మొదటి యవ స్థయు, చివరి యవస్థయు మాత్రము మనకు కన్పట్టుచున్నవి; మధ్యావస్థలు మనకు కన్పట్టుటలేదు ఆ మధ్యావస్థలనుకూడ చూడగల్గిన శక్తి మహర్షుల కుండెను. ఏకర్మ యేరీతిగా ప్రారంభమై యే యే మధ్యపరిణామములను పొంది యే చివరి పరిణామములో మనకు వ్యక్తమగుచున్నదో మహర్షులకు తెలిసియుండెను. ఆ మధ్యావస్థల పరిజ్ఞానము మనకు లేక పోయినను మహర్షుల వాక్యమందు విశ్వాసముంచి యేకర్మకు నే ఫలమని వారు చెప్పినారో గుర్తించి సుఖమార్గము నాశ్రి

యించి దుఃఖమార్గమును విడచుట యాస్తిక్యమున కొక లక్షణముగా చెప్పబడినది. ఏ కర్మ కెట్టిఫల ముండునను విషయములోనే వారియందు విశ్వాసముంచుట యవసరము; కాని కర్మయు ఫలమును ఒకే వస్తువుయొక్క రెండు దశలని తెలిసికొనుట యనుభవసిద్ధమే.

ఒక డాహారమును తినుట యను కర్మను చేయగా క్షున్నివారణమను ఫలము వచ్చినది. నోట వేసికొన్న యాహారము నమలబడుట, లోపలకు పోవుట, ఉదరమును నింపుట, బాధను తగ్గించుట మున్నగు పనులన్నియు నొకే మహాకార్యములో నంగభూతములుగా నేర్పడినవే కాని యవి యేవియు క్రొత్తగా నెక్కడనుండియో వచ్చిన వేర్వేరు కర్మలు కావు. ఆకలి తగ్గుట యనునది యారంభింపబడిన భక్షణకర్మయొక్క చివరి స్వరూపమే కాని మరొకటి కాదు

ఒక చెఱువులో మధ్యను ఱాతిని విసరివైచినా మనుకొనుడు. తత్ఫలితముగా అలలు చిన్న చిన్నవి యొడ్డును తాకుచున్నవని చెప్పుదుము. కాని చెఱువు మధ్యలో ఱాయి పడుట యనుదాని కొనసాగింపే యాయల లొడ్డునకు వచ్చుట యని గుర్తింపవలయును. ఆ ఱాయి పడుటను, అల లొడ్డుచేరుటను మాత్రమే చూచినవాడు ఆ రెంటి సంబంధము నెఱుగకపోయినను మధ్యవిషయములను చూచినవాడు ఈ ఫల

మనునది ఱాయి పడుటయొక్క చివరి స్వరూపమే యని గుర్తింపగలడు.

ఈనాడు మనము చేసిన యేకర్మయు అంతతో నంతరింపదనియు, దానికి తరువాతి స్వరూప మేదియో యుండి తీరుననియు స్పష్టమగుచున్నది. ప్రస్ఫుటముగా పైకి గోచరించు నొక కర్మావస్థకే కర్మఫల మను పేరును మనము వాడుచున్నాము. కావున సంస్కృతభాషలో కర్మన్‌శబ్దము చేయబడు పనికేగాక అనుభవింపబడు ఫలమునకు కూడ వాడబడుచున్నది. 'కురుకర్మ' "అనుభూయతేకర్మ" ఇత్యాది ప్రయోగములు చూడదగును. చేయబడునదియు, అనుభవింపబడునదియు నొకే కర్మయొక్క ప్రథమ చరమావస్థలగుటయే యీ ప్రయోగములకు కారణము.

బీజములో వృక్ష మిమిడియున్నట్లు కర్మలో కర్మఫల మిమిడియుండి కాలాంతరమున పైకి వచ్చుచున్నది ఆకాలము క్షణమే కావచ్చును; కొన్ని శతాబ్దములైనను కావచ్చును.

కర్మ, కర్మఫలములకుగల యీ సంబంధము నెఱుగనివాడు ఇచ్చవచ్చిన దుష్కృతములను చేసి ఫలమునకు వెఱువడు. అరచేతితో బల్లపై గట్టిగా కొట్టినవాడు తానుబల్లను కొట్టినాననుకొనుచున్నాడు. కాని వాడు బల్ల నెంత గట్టిగా కొట్టినాడో, బల్లకూడ వాని నంత గట్టిగానే కొట్టినదని పదార్థవిజ్ఞానశాస్త్రము (Physical Science) మనకు చెప్పు

చున్నది. బల్ల బలహీనమైనదయినచో నది విరుగును. చేయి విరిగినను విరుగకపోయినను ఎంత యొత్తిడిబల్లపై వీడు గల్గించినాడో అంత యొత్తిడియు వీనిచేతికి తగిలియేయున్నది.

ఇది కర్మసిద్ధాంతముయొక్క రహస్యము. ఒకడు నిరపరాధిని చెంపపై కొట్టి బలగర్వముతో విఱ్ఱవీగును. ఏదో యొక ఉత్తరకాలములో, ఉత్తరజన్మలో, దానిఫలము వీని కనుభవములోనికి వచ్చును. కర్మకును తత్ఫలమునకును గల అనుసంధానకాల వ్యాపారమునకు "అపూర్వము'' అను పేరును పూర్వ మీమాంసకులు వాడియున్నారు.

చేయనిదేదియు ననుభవింపవలసి యుండదని శాస్త్ర నిర్ణయము. అట్లనుభవింపవలసి యుండుననుట అకృతాభ్యాగమమను దోషమని తర్కశాస్త్రము చెప్పుచున్నది. మరియు చేసినదేదియు అనుభవింప నక్కరలేకుండ పోదు. అట్లు పోవుననుట కృతప్రణాశదోషము. ఈరెండు దోషములను తప్పించుకొనుచునే కర్మ, కర్మఫల సిద్ధాంతము నడచుచుండును.

అకృతాభ్యాగమదోషమున కొడిగట్టుదుమేని కొందరకు సుఖము కల్గుటయు, కొందరకు దుఃఖము కల్గుటయు వారువారు చేసికొన్న కర్మలనుబట్టి యుండదనియు, ఈశ్వరుడు అకారణముగా తెచ్చిపెట్టినదనియు చెప్పినవార మగుచున్నాము. అట్లే మనకువచ్చు కష్టములనుకూడ అకారణముగానే మన కీశ్వరుడు కల్గించుచున్నాడనవలసి వచ్చును. దీనివలన ఈశ్వరునకు దయారాహిత్యము, పక్షపాతము అను

రెండుదోషములు వచ్చిపడును. అది యెవ్వరికిని ఇష్టాపత్తి కాదు. బాదరాయణులు బ్రహ్మసూత్రములలో నీయంశమును స్పష్టపరచి యున్నారు.

"వైషమ్యనైర్ఘృణ్యే న, సాపేక్షత్వాత్ ;
తథాహి దర్శయతి'' (2—1—34)

(ఈశ్వరునకు పక్షపాతము, క్రూరత్వము ఆపాదింప తగదు. ఏలయన : సుఖదుఃఖముల నొసగుటలో పరమేశ్వరుడాయాజీవుల శుభాశుభ కర్మలను విచారణలోనికి తీసికొనుచున్నాడు. శ్రుతి యట్లే చెప్పుచున్నది.)

జీవుడే దేహమును విడచి వెళ్ళునపుడు తా నిదివరకు చేసికొన్న సమస్త కర్మలను సూక్ష్మరూపములో తనతో తీసికొనిపోవును. ఏకర్మ యెపుడేరీతిగా ఫలింపవలయునో యది యపు డట్లు ఫలించును. సాధారణముగ మనోవాక్కాయములలో దేనితో చేయబడిన కర్మయైనను మన ననుభవింపవలసియుండును. వాక్కుచేత చేయబడిన దుష్టకర్మయొక్క ఫలము ఇతరులు మనలను గురించి కఠినోక్తు లాడుట మున్నగు వానిచే కలుగును. అట్లే వాక్కృతమైన సత్కర్మయు వాక్కు మూలముననే యనుభవమునకు వచ్చును. శరీరముతో చేసిన కర్మ శరీరముచేతను మనస్సుచేతను అనుభవింపవలసి యుండును. కేవల మానసికకర్మలు మనోరంగముననే యనుభూతికి వచ్చును. ఇది సామాన్య నియమము.

స్వల్పములైన మార్పులతో నీ నియమ మెల్లప్పుడును వర్తించును. స్థూలశరీరముతో ననుభవింపవలసిన పుణ్యపాపములు మన కుండుటచే జన్మాంతరము తప్పనిసరి యగుచున్నది. సూక్ష్మశరీరముచేతను యాతనాశరీరముచేతను అనుభవింపవలసిన పుణ్య పాప ఫలములు కొన్ని పరలోకములలో ననుభవింపవలసియుండును.

కర్మసిద్ధాంతములో మనస్సునకుగల స్థానమును మరొకవిధముగాకూడ మనము గ్రహించుకొనవలసి యున్నది. అన్న దానమను పుణ్యకార్యమును ఒక ధనికుడును. ఒక పేదవాడును చేయవచ్చును. ధనికు డిడినంత రుచ్యాన్నమును పేదవాడిడజాలక పోవచ్చును. ఫలము అన్నముయొక్క రుచ్యత్వమును బట్టియే యుండదు. మరొకడు తాను తినుటకు చాలినంత లేకపోయినను అందు కొంత క్షుద్బాధితున కిడును. వీనికి పై యిద్దరికంటె గొప్పఫలము వచ్చును. కర్మ యంతయు పాంచభౌతిక దృశ్య ప్రపంచమునకు సంబంధించినదే యని పైకి కన్పట్టినను దాని సంపర్కము మనోమయ కోశమునకే హెచ్చుగా కలదని బహువిధముల నిరూపితమగుచునేయున్నది.

మనోవాక్కాయముల సమన్వయము సహజము; వీని యనన్వయము కృత్రిమము. మనస్సులోని భావమున కనుగుణముగా వాక్కు ఆవిష్కారమగును; మానసికస్పందనమున కనుగుణమైన స్పందనము శరీరముపై కన్పట్టును.

ఒకప్పుడు మనస్సులో నొకటి తలచి పైకి మరొకటి చెప్పుటయు, మరొకటి చేయుటయు సంభవింపవచ్చును. కాని యిట్టి మాటయు చేతయుకూడ మానసిక స్పందనమునకు అనుకూలములైనవే. ఆ మానసిక స్పందనము మొదటిది కాదు; తర్వాత నేర్పడినది. ఒకనికి నీ వపకారము చేయదలతువు. వానితో "నీ కుపకారము చేయుదు"నని చెప్పుదువు. ఈయనన్వయమునకు కారణము : అపకారము చేయదలచిన భావమునకు తర్వాత మరొకభావము నీ మనస్సులో కలిగినది. ఉపకారము చేయదలచుచున్నానని వీనితో చెప్పవలయు ననునది యీ భావముయొక్క స్వరూపము. కావున ఉపకారము చేయుదునని నీవు చెప్పినమాట మొదటి భావమున కనుగుణముగా లేకపోయినను రెండవసారి బయలుదేరిన మానసికభావమునకు అనుగుణముగనే యున్నది. అట్లే వాగ్వ్యవయము. మన స్సేభావమును సంకల్పించునో తదనుగుణముగా ధ్వని పైకివచ్చు యంత్రనిర్మాణము మన శరీరములో నున్నది. కావున నిచట దోషమంతియు మనస్సుదే:

మానసికభావమే శరీరచేష్టానురూపమును పొందును. మనస్సులో నొకటి పెట్టుకొని పైకి మరొకరీతిగా వర్తించువారెల్లరు మనస్సునకు వ్యతిరేకముగా సంచరించుచున్నారని యర్థముకాదని చూచియున్నాము. ఆ మనస్సే తన స్వరూపమొకటియై యుండగా మరొకరీతిగా పైకి కన్పట్టవలయునని తలచినది. దాని కనుకూలముగా చేష్ట పైకి వచ్చుచున్నది. ఈ చేష్ట పూర్తిగా మనోభావముయొక్క ప్రతిబింబమే.

ఈరీతిగా వాక్కులోకాని శరీర చేష్టలలోకాని దోషములుగా కన్పట్టునవన్నియు మనస్సులోని దోషములే యగుచున్నవి.

ఎంత అప్రియత్నోద్భూతముగా పైకి కన్పట్టు శారీరక చలమునకైనను కారణము మనస్సులో ఆ చలనము కలుగవలయునను సంకల్పమే యనునది ముఖ్యవిషయము. ఎవరైనను మన ముఖముమీదకు చేతిని ఎత్తుచో మన కంటి రెప్పలు మూతపడును. నేత్రములు సున్నితములగుటచే వానికి దెబ్బ తగులకుండ చూచుకొనవలయునను సంకల్పము మన మనస్సులో బయలుదేరుటచే తత్ఫలితముగా కన్నులు మూతపడుట క్షణములో సంభవించును. అంతలో నా మానసిక సంకల్పము బయలుదేరినదని కూడ మనము గుర్తింపజాలము. వానంతనవియే కన్నులు మూతపడుచున్నవని తలతుము. మానసికకర్మలే కాక వాచిక శారీరక కర్మలుకూడ మనస్సులోనే ఉత్పన్నములై పైకి ఆవిష్కరింపబడుచున్నవి. ఈ కారణము చేతనే మనోవాక్కాయ కర్మలన్నియు తమ ముద్రను మనస్సుమీద విడచుటయేగాక పరిణామమును లయమునుకూడ మనస్సులోనే పొందుచున్నవని చెప్పవలయును. ఉత్పత్తి యెచ్చటనో లయ మచ్చట యనునది శాస్త్రసమ్మతమైన సిద్ధాంతము. మట్టితో కుండ చేయబడినది. కుండ పగులుచో మట్టియే యగును. అట్లే సమస్త కర్మలు ఏ మనస్సునుండి వచ్చినవో ఆ మనస్సులోనే యవి

యన్నియు తమ లయపరిణామములను గల్గియున్నవి. అనగా సమస్త కర్మఫలితము మానసిక రంగముమీద కన్పట్టును.

ఈరీతిగా సమస్తమునకు కర్తయైన మనస్సే కర్మఫలానుభవమును కూడ కల్గియున్నది.

కర్మఫల మవశ్య మనుభవింపవలసి యున్నందున సుఖప్రాప్తికి కాని దుఃఖనివారణమునకుగాని ప్రయత్నించుట వ్యర్థమని తలంపరాదు. ఎందువల్లననగా : ఏజన్మలోనో చేసికొన్న కర్మకే ఫలము అనివార్యముగా నుండునపుడు ఈ జన్మలో చేయుచున్న కర్మకు ఫలము కలుగదనుమాట అర్థములేనిది. ఒకవస్తువు తినుటవలన కడుపులో నొప్పి వచ్చుచో, మఱొకవస్తువు తినుటవలన నానొప్పి పోవచ్చునను కొనుటలో దోషములేదు. ఒకడు దారిద్ర్యముతో బాధపడుచున్నచో అది వానికర్మమని తలచి తన్నివారణమునకు యత్నింపరాదనుట శాస్త్రమునకును, యుక్తికిని కూడ విరుద్ధము. అదివరకు వాడుపడిన బాధ ప్రారబ్ధమేయైనను పురుషకారమువలన నది తగ్గుచో ఆక్షణముననే ఆ ప్రారబ్ధము అంతమొందినదని యర్థము. ప్రారబ్ధములో అంతర్భూతములుగాని సుఖదుఃఖానుభవములు అప్పటికప్పుడు మనము చేయు కర్మలనుబట్టి మారుచుండును. ఆ కర్మాచరణమునకు అనగా పురుషకారమునకు ఈ మాత్రమైనను అవకాశములేనిచో విధినిషేధాత్మకము లయిన శాస్త్రవాక్యములు వ్యర్థములు కావలసి వచ్చును.

జీవుడు చేసికొన్నదానితో నిమిత్తము లేకుండ భగవంతుడే జీవు నిప్పుడు నడపించుచున్నాడనుట యెట్లు కుదరదో యట్లే వెనుక జీవుడు చేసికొన్నదానివలననే యొక సరణిలో సమస్త భవిష్యజ్జీవితము నడచిపోవుననియు, ప్రకృతము ప్రయత్న పూర్వకముగా జీవు డేమియు చేసికొన నక్కరలేదనియు నుడువుటయు కుదురదు. ఈ రెండు వాదములలోను ఉన్నలోప మొక్కటియే. "ఇట్లు చేయవలయును; ఇట్లు చేయకూడదు" అను విధినిషేధాత్మకమైన శాస్త్రము వ్యర్థమైపోవును. వేదము వ్యర్థముగా మానవులకు ప్రసాదింపబడినదను వాద మెవ్వరికి ఇష్టముకాదు. కావున నీ జన్మములో పురుష ప్రయత్నము నిష్ఫలమనుట కుదరదు.

"కృతప్రయత్నాపేక్షస్తు విహితప్రతిషిద్ధావైయర్థ్యాదిభ్యః" అను బ్రహ్మసూత్రము (2-3-42) పయిని భాష్యమును రచియించుచు శ్రీ శంకరులు ఇదివరకు జీవుడు చేసికొన్న పురుషకారమును బట్టియే పరమేశ్వరు డాతనిని నడుపుచున్నాడననిచో శాస్త్రము వ్యర్థము కావలసివచ్చునని చెప్పిన యాక్షేపము ప్రకృత పురుషకారమును నిరాకరించుటకు కూడ వర్తించును. "ఈశ్వరస్య చాత్యంతా నపేక్షత్వే లౌకికస్యాపి పురుషకారస్య వైయర్థ్యమ్." అను భాష్యవచనములో సూచింపబడినది.

ఈ సందర్భమున ఆగామి సంచిత ప్రారబ్ధములను మూడు విధములయిన కర్మను గురించి కొంచెము చెప్పవలసియున్నది.

అనాదిగా జన్మపరంపరలో చేసికొని కొంత యనుభవింపబడిపోగా నిక మిగిలిన కర్మయంతయు నొకరాశిగా నున్నదనుకొందము. అందుండి కొంత కర్మ తీసికొని మన మీజన్మ మెత్తినాము. ఈ దేహమును విడచులోగా ఆ కర్మ ననుభవించి తీరవలయును. దానికే ప్రారబ్ధ మనిపేరు. దానిని తప్పించుకొను టెవ్వరికిని సాధ్యముకాదు. బ్రహ్మజ్ఞానము కలిగినవానికి కూడ నిది యవశ్యానుభోక్తవ్యమే. ఏది ప్రారబ్ధమో యేది కాదో యెవ్వరికిని ముందుగా తెలియదు. కావున సుఖప్రాప్తికిని దుఃఖనివారణమునకును ప్రయత్నమును చేయుచునే యుండదగును.

ప్రారబ్ధ కర్మను తీసికొనిరాగా నిక మిగిలిన కర్మరాశికి సంచితమని పేరు. అది భవిష్యజ్జన్మలలో ననుభవమునకు నిలవయున్నది. కాని దాని ప్రభావము మనపై నొకవిధముగా కన్పట్టవచ్చును. ఆ కర్మయొక్క గాలి మనపైకి వీచుచుండును. దానివలన మనము చలింపవచ్చును, చలింపకపోవచ్చును, మంచికైనను చెడ్డకైనను మనము దానికి సాధారణముగా లొంగుదుము. వ్యతిరేక ప్రయత్నము తగినంత చేయుచో లొంగము. ప్రారబ్ధమునకు లొంగినట్లు దీనికి లొంగుదుమను నియమము లేదు.

ఒకని సంచితకర్మరాశియొక్క గాలి వాసన మనస్సుపై ప్రసరించి వీచినపుడు వాడు లొంగుటయో లొంగకుండుటయో యనునది వాడీ జన్మలో చేయుచున్న అభ్యాసమునుబట్టి యుండును. సంచిత కర్మలోని యొక పాపాంశముయొక్క గాలి సోకుటచే నొకనికి సురాపానమో, హింసయో చేయ వలయునను బుద్ధి పుట్టవచ్చును. ఈ జన్మలో సదుపదేశములను వినుటవలననో, సదభ్యాసముల నలవరచుకొనుటవలననో వాడా దుష్టప్రేరణలను త్రోసివేసికొనవచ్చును. వేదాంత శాస్త్రములో పురుషకారమునకు గల ప్రయోజనములలో నిది యొకటి. సంచితకర్మయొక్క ప్రభావము వలన కొన్ని సత్ప్రేరణ లీజన్మలో కల్గుచున్నను, ఇప్పటి ప్రవర్తనము, అభ్యాసము చెడ్డవిగా నున్నచో ఆ సత్ప్రేరణలు సముద్రములో పుట్టిన యలలవలె నచ్చటనే యణగిపోవును.

ప్రారబ్ధమువలె కాక యీ సంచితకర్మ బ్రహ్మజ్ఞానము వలన నశించును. పెద్ద దూదిపర్వతము నిప్పురవ్వ పడుటచే భస్మమగునట్లు పర్వతమువలెనున్న యీ సంచితకర్మ జ్ఞానముచే దగ్ధమైపోవును. కావున సంచితకర్మను పురస్కరించుకొని జన్మమెత్తవలసిన యావశ్యకత జ్ఞాని కుండదు.

ఇంక ఆగామి కర్మ కలదు. ఈ జన్మలో చేసికొనుచు, ఈ జన్మలోనే కాని భవిష్యజ్జన్మలలో కాని యనుభవింపవలసి యున్న కర్మకు ఆగామి కర్మ యని పేరు. రాబోవు జన్మలో

నిది కొంత ప్రారబ్ధముగాను కొంత సంచితముగాను మారి పోవును. బ్రహ్మజ్ఞాని విషయములో నీకర్మకూడ ననుభవము నకు రాదు. దగ్ధ బీజన్యాయముగా నిది యంకురానర్హమై పోవును. సామాన్యముగా గింజలకు మొలకెత్తు గుణము గలదు. కాని యొక పాత్రలో వేసి నిప్పుమీద వేయించబడిన గింజలు మొలకలెత్తజాలవు. అట్లే జ్ఞానమనెడు నగ్నిచే దగ్ధములైన కర్మబీజములు మొలకలెత్తవు. బ్రహ్మజ్ఞాన రహితుల ఆగామి కర్మలన్నియు ఫలించియే తీరును. నిష్కామముగా నీశ్వరార్పణబుద్ధితో నాచరింపబడు కర్మలు మాత్రము ఈశ్వరానుగ్రహము, లేదా చిత్తశుద్ధి యను ఫలమును జనింపచేయును.

ప్రతి కర్మకును ఒక ఫలమును గల్గించు గుణ ముండుటయే కాక మరొక విచిత్రమైన లక్షణముకూడ కలదు. అది యేదన ? ఏ చిత్త సంస్కారముచే నాకర్మ చేయబడినదో ఆ చిత్తసంస్కారము నాకర్మ బలపఱచును. ఎట్లన : ఒకడు హింస చేసినాడు. దీనివలన వాడనుభవింపవలసిన ఫల ముండనే యుండును. అదిగాక క్రొత్తగా చేయబడిన యీ పాపముచే వాని చిత్తములో నదివఱకుండిన దుర్గంధము పెరుగును. వాని హింసా ప్రకృతి మరింత యెక్కువగును. అట్లే యొకని కొకనాడు గంటసేపు భగవద్ధ్యానము చేయ వలయునను బుద్ధి పుట్టినది. అంతర ప్రేరణకు లొంగి వాడు

భగవద్ధ్యానము చేసినాడు. దానివలన కలుగవలసిన ఫలము కలుగును. అంతియేకాదు. ఏ చిత్తసంస్కారముచేత వానికి ధ్యానము చేయవలయునను సద్బుద్ధి పుట్టినదో ఆ చిత్తసంస్కారము దీనివలన పెరుగును.

ఈరీతిగా నిదివరకుండిన సంస్కారమునకును, ఇప్పుడు చేయబడుచున్న కార్యమునకును ద్వివిధసంబంధము కలదు. ఇట్టి విషయమున సాదృశ్యము నిమిత్తమై మరొక యంశము నిట నుదాహరింపవచ్చును. కట్వామ్ల లవణాది పదార్థములు రజోగుణ సంపన్నుల కిష్టమగును. ఈ పదార్థములను తినుట వలన రజోగుణమునకు దోహదమగును. అట్లే తమోగుణము హెచ్చుగా నుండుటచే పర్యుషితాది వస్తుభక్షణమందు అభిలాష కలుగును. వానిని భక్షించుచో ఆ గుణమే తిరిగి పెరుగును. అట్లే సాత్త్వికాహారమును గురించి తెలిసికొనదగును. ఏ వాసనచేత నొకపని చేయవలయునను నభిలాష కల్గునో యాపని నాచరించుటచే నా వాసన పెరుగును. కావున దుష్ట ప్రేరణలకు లొంగి దుష్ట వాసనలను పెంచుకొనరాదనియు, సత్ప్రేరణలకు లొంగి సద్వాసనల నలవరచుకొనవలయు ననియు తేలుచున్నది.

షడ్దర్శనములు

సర్వప్రాణులకు ఆనందమే లక్ష్యము. పరమానంద మెట్లుండునో తెలిసికొనజాలక మన యనుభవమునకు, ఊహకు నందునట్టి సుఖమునే పరమప్రాప్యముగా భావించుచు దానికై కృషి చేయుచుందుము. వివిధప్రకృతులుగల మానవులకు వివిధ రూపములయిన సుఖములు లక్ష్యములుగా కన్పట్టును; మరియు సుఖసాధనములలో కొన్నియే వీరి యభిరుచికిని, శక్తికిని సరిపడుచుండును. మానవప్రకృతిలో నానాత్వ మున్నంతకాలము భిన్నలక్ష్యములు భిన్న సాధనములు తప్పవు. సర్వోత్కృష్టమైన యానంద మొకటి యున్నంత మాత్రమున దానిచేతనే యెల్లరును నాకర్షింపబడుదురనుమాట లేదు; తప్పక గమ్యస్థానమును చేర్చగల యొక కఠినసాధన మున్నంతమాత్రమున నెల్లరు దానిని చేపట్టగలరను నియమముకూడ లేదు. భిన్నాంతరములలో నున్న మానవులకు అందుబాటులోనుండు ఆనందభూమికలను, వాని సాధనములను ప్రదర్శించుచు లోకానుగ్రహపరాయణులైన మహర్షులు రచించిన గ్రంథములు కలవు. అవి దర్శనగ్రంథములని చెప్పబడుచున్నవి.

వేదప్రామాణ్యము ననుసరించి రచింపబడిన దర్శనములు ఆఱు ప్రసిద్ధములుగా నున్నవి: (1) న్యాయము (2) వైశేషికము (3) సాంఖ్యము (4) యోగము (5) పూర్వమీమాంస (6) ఉత్తరమీమాంస (వేదాంతము)— అని యీదర్శనముల నామములు.